REGD. NO. M. 3152

1-5-53 శుక్రవారం

ESTD: 1930

# జమీన్ రైతు

THE ZAMIN RYOT. NELLORE.

2 అణాలు

| సంపుటి | మేనేజింగ్ ఎడిటర్: నెల్లూరు వెంకట్రామానాయుడు | సంచిక |
|---|---|---|
| 25 | సంపాదకుడు: నెల్లూరు శ్రీరామమూర్తి | 18 |


## ఆంధ్రకు కౌన్సిల్ వుండదట

పాపం! మద్రాసు కౌన్సిల్ ఆంధ్రసభ్యుల ఢిల్లీ రాయబారం వృధా అయినట్టుగా కనిపిస్తుంది. ఈ విషయమై సంజీవరెడ్డిగారిని పత్రికా విలేకరులు ప్రశ్నించగా ఇండియాప్రభుత్వం ఆంధ్రరాష్ట్రంలో కౌన్సిల్ వుండరాదని ఒకసారి నిర్ణయించేసింది కనుక అందులో మార్పుండబోదని తానభిప్రాయపడుతున్నట్టుచెప్పారు. సంజీవరెడ్డిగారి యీ ప్రకటనను మనం అధికార నిర్ణయంగా తీసుకోవచ్చునేమో!

# ★ తెలుగుమంత్రులపై అవిశ్వాస ప్రకటన! ★

## పలుకుబడికోసం అనవసర ఆందోళన రేకెత్తించడం భావ్యమా?

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డిగారు యిటీవల ఒక్కసారిగా, రెప్పపాటు వ్యవధిలో, పూర్తిగా రాజగోపాలాచారి ద్వేషిగా మారిపోయారు.

రాజగోపాలాచారిగారిపట్ల యింతద్వేషాన్ని ప్రదర్శించుటకు కారణమేమో మేమూహించలేకున్నాం.

అసలు ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ప్రసక్తి ప్రారంభమైనపుడే, యిదీ ప్రారంభమైంది. రాష్ట్రనిర్మాణంతోపాటు యిందులోకూడా క్రొత్తశకం, క్రొత్తయుగం ప్రారంభమైనదనే చెప్పవచ్చు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గం 25 తేది విజయవాడలో సమావేశమై, ఆంధ్ర ప్రజానాయకుల సంప్రదించకుండాజరిగే విభజన ఏర్పాట్లు ఆంధ్రులు ఒప్పుకోరని హెచ్చరిస్తూ, ఏప్రెల్ 8 తేది ప్రజాస్వామ్యపక్షాల శాసనసభ్యులు చేసిన తీర్మానాన్ని ఆమోదించింది.

దీని తర్వాత సంజీవరెడ్డిగారు మద్రాసులో పత్రికా విలేఖరులకిచ్చిన యింటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలు కొంత విస్మయాన్ని విచారాన్ని కూడా కల్గిస్తున్నాయి. సంజీవరెడ్డిగారు, ముఖ్యంగా రాజాజీ మంత్రివర్గంలోని తెలుగు సభ్యులను అవమానపరచారనే చెప్పవలసివుంది. ఆయనధోరణి గమనిస్తే, ఆయనకు గిట్టలేదు కాబట్టి వారు రాజీనామాలు యిచ్చి బయటకు వచ్చేయాలని ఆయన అభిప్రాయపడుతున్నట్టుగా మనం వూహించవచ్చు.

### అనవసర ఆందోళన

యిటీవలలో మంత్రివర్గంపై ప్రకాశం పంతులు, వారి అనుచరులు చెలరేపిన విమర్శ తంటే, యీనాడే ఎక్కువగా జరుగుతున్నట్టు కానవస్తుంది. దీనికి కారణం, బహుశః తనలకే ఆంధ్ర అభిమానంతంటేగూడా, కేవల వ్యక్తిగతంగా వున్న అభిప్రాయభేదాలే కారణంగా వుంటాయేమో!

సంజీవరెడ్డి, రాజగోపాలాచారిగారలమధ్య విభేదం యీనాటిదికాదు. మంత్రివర్గనిర్మాణముతో, ఆంధ్రసభ్యులకు సంబంధించినంతవరకు, తన్ను సంప్రతించలేదనే కొరత, కోపంకూడా సంజీవరెడ్డిగారికుంది. 'అది చిన్న లీడర్ ఎన్నికలో మరింత ఎక్కువయింది. ఆటి తర్వాత సావకాశం యీ విమర్శలు, యీ ఆందోళన కూడా!

### ఆంధ్ర రాజకీయాలు

★

[ మా రాజకీయ పరిశీలకుడు ]

### పాత చరిత్ర

సంజీవరెడ్డిగారు ఆంధ్రమంత్రులపై, అసలు మంత్రివర్గంపై అవిశ్వాసం ప్రకటించేసరికి, రాజకీయ పరిశీలకులు పాత చరిత్రను తిరగతోడి కుమారస్వామిరాజామంత్రివర్గంలోగాని, రామస్వామిరెడ్డియార్ మంత్రివర్గంలోగాని వుండిన తెలుగు మంత్రులు తమిళులకమ్ముడుపోయారా? అని ప్రశ్నించడం సహజం. సంజీవరెడ్డిగారుకూడా మంత్రిగావుండినవారేగదా! అనాడు కోటిరూపాయల పరిహారం కోరినపుడు, అసలు మద్రాసునగరంపై హక్కు నిరాకరించినపుడు, ఆంధ్రులు, మంత్రివర్గ వ్యతిరేకాయకులుకూడా సంజీవరెడ్డిగారినికూడా తమిళులతోకలసి ఆంధ్రులకు ద్రోహంచేశారన్నపుడు, ఆ ఆరోపణను వీరు ఎంత ఖండించలేదు? వారు మంత్రివర్గ వ్యతిరేకతతో యీ నిందమోపుతున్నారని తమ స్థానాన్ని బలపరచుకోలేదా?

### తెలుగు మంత్రులకు ఆంధ్రత్వంవుండదా?

ఉద్యోగుల విభజనకు సంబంధించి అధికారుల వుపసంఘంచేసే నిర్ణయాలను పరిశీలించుటకు మంత్రివర్గ వుపసంఘం ఒకటి నియమించబడింది. రాజగోపాలాచారిగారు దాన్ని వుత సంఘమని పిలువకపోయినా దాన్ని మనం వుపసంఘమేయందాం! అందులో ముగ్గురు తెలుగువారు, ముగ్గురు తమిళులవున్నారు. అంటే భాషావర్గాలవారికి సమాన ప్రాతినిధ్యమన్నమాట.

తెలుగుమంత్రులు తెలుగుప్రజలకు, ఎవరు ఒప్పుకున్నా ఎవరు ఒప్పుకోకపోయినా, ప్రాతినిధ్యమెంహించితీరుతారు. వారూ ప్రజలచేతఎన్నుకోబడ్డ శాసనసభ్యులేగదా! ఎంతరాజగోపాలాచారిగారిముఖ్యమంత్రిత్వంక్రిందవున్నా, తమను మంత్రులుగా వరించాడనే కృతజ్ఞతాపూర్వక అభిమానం ఎంతవున్నా, వారు ఆంధ్రులమని, ఆంధ్రుల హక్కులు కాపాడాలనే విషయం వారు మరచిపోగలరా? బాధ్యతగల పదవులను స్వీకరించకముందు, ఒకపేళ వారిపట్ల అభిమాన

● 7 పేజీలో

## ఆంధ్రప్రజాస్వామ్య మంత్రివర్గానికి సంజీవరెడ్డి నాయకత్వం?

ఇటీవల ప్రకాశంగారికి సంబంధించిన ఒక వారపత్రిక ఒక ఆందోళనవెలిబుచ్చింది. సంజీవరెడ్డిగారి తంత్రజ్ఞత ఏమిటో అగమ్యగోచరంగా వుందని, ప్రకాశంగారిని తోసివేసి, తక్కినవారితో తానే మంత్రివర్గాన్ని నిర్మించుటకు సంజీవరెడ్డిగారు ప్రయత్నిస్తున్నారనేదే ఆ ఆందోళన.

ప్రకాశంగారిని త్రోసివేసే తలంపు సంజీవరెడ్డిగారికిగాని, మరెవ్వరికిగాని వుండదు. వుండకూడదు. ఇప్పటివరకు కృషీకార్ లోక్‌పార్టీ మాత్రం కాంగ్రెసులో సహకార సభ్యులుగా చేరింది. ప్రజాపార్టీగాని, స్వతంత్రులుగాని సహకారసభ్యులుగా చేరలేదు. కాని వారి సహకారం తప్పక లభించగలదు. ఇప్పటి పరిస్థితినిబట్టి దాదాపు సగంమంది– సంజీవరెడ్డిగారి లెక్క ప్రకారం 72 మంది - కాంగ్రెసును బలపరుస్తున్నారు. ఇంక కొంతమంది సహకారం లభిస్తేనేగాని సుస్థిర ప్రభుత్వం నెలకొనదు.

ప్రకాశంగారితో మంతనాలుమాత్రం అంతం లేకుండా జరుగుతూనేవున్నాయి. మొన్నకూడా పంతులుగారితో సంజీవరెడ్డిగారు సంప్రతించారు. సంభాషణల సరళి ఏమిటో, ఏవిషయంలో కుదరలేదో ఏమో బయటకు మాత్రం ఏమి తెలియడంలేదు.

కాని మొన్న సంజీవరెడ్డిగారు మాటల ధోరణిలో కాని ఏ కొద్ది నాయకుల్లోని తప్ప మంత్రివర్గం ఏర్పరిచే బలంవుండదని అన్నారు. అంటే ఆయనకు మంత్రివర్గాన్నేర్పరచే అభిప్రాయంవుందని, ఆయనే ముఖ్యమంత్రికావాలనే వుద్దేశ్యంవుందని సామాన్యులు వూహించుకున్నారు.

అందరిమీదకంటే సంజీవరెడ్డిగారికి ప్రకాశంగారిపై అభిమానం ఎక్కువ. అట్లనే ప్రకాశంగారికి సంజీవరెడ్డి అంటే విశ్వాసం అధికం. అందువల్ల నాయకత్వ వ్యవహారంలో యిద్దరిమధ్య ఏ అభిప్రాయం కుదరలేదేమోనని రాజకీయ పరిశీలకులు వూహిస్తున్నారు.

## నిడిముసిలిలో మరొక ఖూనీ!

నెల్లూరుతాలూకా నిడిముసిలి గ్రామంలో చెముడుగుంట కన్నయ్య అనే హరిజనుడు 26-4-53 తేది పగలు 3 గంటలప్పుడు హత్య గావింపబడ్డాడు.

ఈ హత్యకు సంబంధముంటుందని అనుమానించబడ్డ చెన్నూరు రమణారెడ్డి, చెన్నూరు సుబ్బరామరెడ్డి, చిరమన వెంకటశేషారెడ్డి, సేనుగుపల్లి రామిరెడ్డి, యరపల్లి రాఘవరెడ్డి అనేవారలు పరారీలో వున్నట్టు తెలుస్తున్నది.

22-7-51 తేది బంగారం రమణారెడ్డి అనే యువకుడు యీ గ్రామంలో ఖూనీగావింపబడ్డాడు. ఆ సందర్భంలో యిప్పుడే హత్య గావింపబడ్డ కన్నయ్య, మరినలుగురు అరెస్టు గావింపబడి, వారిపై కేసుపెట్టబడి సెషన్సులో, హై ... గా డా త్రోసి వేయబడింది. రమణ ...నికి సంబంధించి, ఈ హత్యజరిగి వుంటుందని అనుమానిస్తున్నారు.

ఇప్పటివరకు ఎవ్వరూ అరెస్టుగావింపబడలేదు. పోలీస్ విచారణ సాగిస్తున్నది.

—మా. వి.

ప్రశస్తమైన ఆయుర్వేదౌషధములకు

చింతలూరువారి

వేంకటేశ్వర ఆయుర్వేద విలయము

ట్రంకురోడ్డు — నెల్లూరు.

# నందికొండకంటే ముందు సిద్ధేశ్వరం, సోమశిల!

## అమలుజరపాలని మంత్రి రంగారెడ్డిగారికి మండల రైతుల విజ్ఞప్తి

గత 22 తేదీ పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ ఎన్. రంగారెడ్డిగారు సోమశిల డామ్ ప్రదేశాన్ని పరిశీలించి, కలువాయి రైతు సభలో పాల్గొన్నపుడు, నెల్లూరు మండల, ముఖ్యంగా దక్షిణప్రాంతరైతుల తరపున శ్రీ వంగల్లు కోదండరామరెడ్డిగారు సమర్పించిన నివేదికే యిది.

—సం. జ. రై

"మాజిల్లాయందు డెల్టాభూములు షుమారు 1,65,000 ఎకరములలో ప్రతిసంవత్సరము ప్రథమపంట వరిపైరు పండింపబడుచున్నది. ఇందులకు కావలసిన నీటిపారుదల పెన్నానదీ కాలువలవల్ల సరఫరా చేయుబడుచున్నది. ఇంతే గాక వర్షములు సకాలమునకురిసియు సంవత్సరములలో పై భూములలో కొంతభాగమందు రెండవపంట వరిపైరుకూడా వేయుట జరుగుచుండినది. కాని, గత 5, 6 సంవత్సరముల నుండి సరియైన వర్షములేనందువల్లనూ, పెన్నానది ఎగువ భాగములందు-అనగా, అనంతపూరు కడపలకు జిల్లాలలో, ఈ నదికి సంబంధించి క్రొత్తకాలువలు త్రవ్వబడుటయేగాక, అనేక ఇంజన్లుపెట్టి చాలాభూములకు నీరు పారించుచున్నందున, మా జిల్లాయందలి భూములకు రెండవటి పంటకే కావలసినంత నీటి సరావరా లేక, తగ్గిపోవుచున్నది. అందువలన షుమారు మూడొంతుల లేక సగమైనా ఎకరములలోని వరిపంటలు ఎండిపోయి. ప్రతిసంవత్సరం వరిపంట అపారముగా తగ్గిపోవుట సంభవించుచూ, మాజిల్లాకు ఎక్కువ నష్టము కలుగుచున్నది. పెన్నానది ఎగువ భాగములయందు క్రొత్త నీటిపారుదల యేర్పాట్లు జరుగుచున్నచో మాజిల్లాలో హెచ్చునష్టము సంభవించియుండెడిది గాదు. మరియు గండికోట ప్రాజెక్టు సఫలీకృతమైనచో మా జిల్లాయందలి డెల్టాభూములకు కావలసిన నీటిపారుదల ఇంకనూ క్షీణించి, ఎక్కువనష్టము కలుగును. పెన్నానది ఎగువ ప్రాంతములలో అమలులో పెట్టబడు నూతన నీటిపారుదల మార్గములవలన ప్రస్తుతము మాజిల్లా యందలి ఆయకట్టునకు కలుగుచున్నట్టి నష్టము కలుగకేయుండుటకై ఈక్రింది కార్యక్రమమును మదరాసు ప్రభుత్వమువారు అచరణలో పెట్టవలయును.

(1) కడప - కర్నూలు కాలువను వెడల్పు ఎక్కువ చేయవలయును.

(2) సోమశిలవద్ద పెన్నానదిపై ఆనకట్ట కట్టవలయును.

"ఈ రెండు కార్యములు నెరవేరినయెడల ప్రస్తుతము పెన్నా నది ఎగువభాగములో క్రొత్తగా ఏర్పడిన కాలువలవలన, మా ఆయకట్టునకు కలుగు నీటిపారుదల నష్టము తీరగలదు. ఎందువల్లననగా మాకు తగ్గిపోయిన నీటిపారుదలను తుంగభద్ర నదీజలములను, కె. సి. కాలువ ద్వారా పెన్నానదిలోనికి ప్రవహింపచేసినచో అట్టి నష్టమునకేమాత్రము అవకాశముండదు. సోమశిలవద్ద ఆనకట్ట నిర్మింపబడినచో, మాకు అధికముగావచ్చు నీటిని నిలుపుకొనుటకును, సరియైన ఋతువులలో ఉపయోగించుకొనుటకును వీలుండును. ఈ ముఖ్య కారణములచే ప్రభుత్వమువారిని సోమశిలవద్ద ఆనకట్టకట్టవలెనని మేము ముఖ్యముగా కోరుచున్నాము. మరియు సిద్ధేశ్వరము వద్దకూడా ఆనకట్ట నిర్మింపబడినచో, సోమశిలవద్ద కట్టు ఆనకట్ట రెండువిధములుగా ఉపయోగించును. అప్పుడు సిద్ధేశ్వరమునుండి సోమశిలవద్దకు రెండు ఆనకట్టలను కలుపుచూ ఒక కాలువ అవసరముగా నిర్మింపబడవలసి యుండును. మరియు కృష్ణా పెన్నారు ప్రాజెక్టు విధానములో సూచింపబడినట్లు, సోమశిలవద్ద ఆనకట్ట ఎత్తు వుండవక్కరలేదు. షుమారు 100 అడుగుల యెత్తుమాత్రం ఆనకట్ట నిర్మింపబడినచో రెండు రిజర్వాయల మధ్య నీటిపారుదల బాగుగా సాగుటకునూ, పెన్నానది దక్షిణ ప్రాంతములకు, సిద్ధేశ్వరమునుండి నీటిసరఫరా

● కొరవ 11 వ పేజీలో

# పెన్నపై సోమశిలవద్ద డాము

## మంత్రికి జి. సి. కొండయ్య ప్రభృతుల వినతి


మంత్రి రంగారెడ్డిగారు 22 తేది సోమశిల వచ్చినపుడు, కలువాయిలో ఆత్మకూరు తాలూకా రైతుల తరపున శాసనసభ్యుడు జి. సి. కొండయ్య, యం. శంకరయ్యగారలు ఆత్మకూరు తాలూకాలో దుస్థితిలోవున్న నీటివసరులను గూర్చి సమగ్రంగా ఒకనివేదిక సమర్పించారు. ఆ నివేదికలోని ముఖ్య భాగాలను దిగువ యిస్తున్నాము.

—సం. జ. రై

"గత 50 సంవత్సరాలుగా ఆత్మకూరు రైతాంగం నెల్లూరుజిల్లా ప్రజలంతా పెన్నానదిపై సోమశిలదగ్గర రిజర్వాయరు కట్టి పెన్నలో వృధాఅవుతున్న ప్రవాహ నీటిని ప్రక్కలకు మరలించి కాలువకు, సప్లయిచేయుమని ప్రభుత్వాన్ని కోరుతూవచ్చారు. సోమశిల ప్రాజెక్టుకై పరిశీలనలు అనేకం జరిగాయి. కాని ఆశలు చూపడంతప్ప ఆచరణలో మాకు నీరందించ దలపెట్టలేదు ప్రభుత్వం. ఇంతలో కృష్ణా పెన్నారు ప్రాజెక్టు పరిశీలనలు జరిగింది. మా తాలూకాలో ఏ మైనరు ఇరిగేషన్ వసతికై ఏ గ్రామస్తులు ప్రభుత్వానికి విన్నవించుకొన్నా "బ్రహ్మాండమయిన ప్రాజెక్టే వస్తూంటే - చిన్నకుంటల సంగతెందుకు" అని అన్నిస్కీములను తోసిపుచ్చేవారు.

"నందికొండ ప్రాజెక్టువల్ల కరవు కరువుకాటకములకు గురి అవుతున్న కనిగిరి, దర్శి, పొదిలి, కందుకూరు తాలూకాలకు నీరు లభిస్తుంది. కావలి, కనుప్పూరు కాలువలద్వారా ఇంకో రెండులక్షల ఎకరాలకు జిల్లా మధ్యభాగానికి నీరందుతుంది. కాని పారంతమైన లక్షలకొలది యెకరాల భూమివున్న పెన్నానది దక్షిణ ప్రాంతానికి నీరు లభించదు. ఇప్పుడున్న నెల్లూరు, కోవూరు తాలూకాల డెల్టాలు దెబ్బతినకుండా రెగ్యులర్ సప్లయి జరగదు. దీనికి కారణం అధికంగా నీరు సప్లయి చేయను కృష్ణలో నీరు వుండదని ఖోస్లా కమిటీ అభిప్రాయపడింది. కాని చెంగల్పట్టుజిల్లాలకు రెండున్నర లక్షల యెకరాలకు నీటి సప్లయిని చూపించను ఖోస్లాకమిటీకి నీరు కనపడింది!

"అందువల్ల [illegible]కొండతోపాటు-పెన్నానదిపై సోమశిలదగ్గర డ్యాము నిర్మించి వృథాగా సముద్రానికి వెళ్లుతున్న ప్రవాహాన్ని ఆపి క్రిందనున్న చెరువులకు - కాలువలకు ఇచ్చి




నట్లయితే - నెల్లూరు, కోవూరు డెల్టాలే కాకుండా- పెన్నానది దక్షిణభాగము పూర్తిగ భాగంలో ఆత్మకూరు - కావలి - వుదయగిరి తాలూకాలో కొంతభాగానికి సమృద్ధిగా

● కొరవ 10 పేజీలో

ముఖ్యవార్తలు ★★★

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణ!

కాంగ్రెసును ధిక్కరించి, కౌన్సిల్ ఎన్నికలకు పోటీచేసిన చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షుడు వెంకట్రామానాయుడుగారిపై క్రమశిక్షణ చర్య తీసుకోడానికి ఆంధ్రకాంగ్రెస్ సంఘం విరమించుకుంది. కారణం కాంగ్రెస్ కోరితే రాజీనామా చేస్తానన్నాడట. కాంగ్రెస్ వద్దంటే పోటీచేసినాయన, కాంగ్రెస్ కోరితే రాజీనామా యిస్తాడట! ఎంత హాస్యాస్పదంగా వున్నదండీ వారిప్రశ్న, వీరి సంజాయిషీ! ఇక కాంగ్రెస్‌లో క్రమశిక్షణ వుండమంటే ఎక్కడుంటుంది?

## సిక్కుల బెదిరింపు!

పంజాబీరాష్ట్ర నిర్మాణంకోసం భారత ప్రధాని నెహ్రూ యింటిముందు తాను, మరి పదిమంది సహచరులు సత్యాగ్రహం సాగించగలమని అకాలీదళ్ నాయకుడు బెదరిస్తున్నాడు. ఇది మతదృష్టితో కోరడంలేదని ఆయన స్పష్టం చేశాడు.

## సన్యాసి టిక్కెట్లు

ఏప్రెల్ 1 తేదినుంచి 16 తేదివరకు యిచ్చిన సన్యాసి టిక్కెట్లు తిరిగా మే 1 తేదినుంచి 16 తేదివరకు ఇవ్వగలరట. వీటి ఖరీదు రూ 30 లు తీసుకున్న రోజు మొదలు 14 రోజులు సదరన్, ఈస్టరన్, సెంట్రల్ రైల్వేలలో పర్యటించవచ్చు.

ఇదిగాక, దేశమంతటా సంచరించుటకు వీలుగా, 150 రూపాయలతో, మూడు నెలలు తిరిగే అవకాశంతో, సీజన్ టిక్కెట్లు యిచ్చుటకు ప్రభుత్వం ఆలోచిస్తున్నదట.

## నెల్లూరు కడప రైల్వేలైను

కడప, నెల్లూరులకు, రాయచోటి కడప మీదుగా నంద్యాల బెంగుళూరులను కలుపు రైలు మార్గాలు నిర్మించాలని, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలో మరికొన్ని లైన్లు నిర్మించాలని లచ్చన్న, ఆదినారాయణరెడ్డి, రాజగోపాలరావు గారలు రైల్వే మంత్రిని కలుసుకొని విజ్ఞప్తి చేశారట. వీటినిగూర్చి శ్రద్ధవహిస్తానని మంత్రి సమాధానం చెప్పినట్టు తెలుస్తున్నది.

## కృపలాని ఉవాచ!

కాంగ్రెస్, ప్రజా సోషలిస్టు మిశ్రమ మంత్రివర్గాలస్థాపనా ప్రసక్తే లేదని ఆ పార్టీ నాయకుడు కృపలానీ స్పష్టంచేశాడు. జయప్రకాశ్ కార్యక్రమం అంగీకరిస్తేనే కాంగ్రెసుతో తిరిగా సంప్రదింపులనికూడా ఆయన న్నాడు.

కృపలానీ యీ ప్రకటన ఆంధ్రలోని వారి పార్టీకి వర్తించదని వ్యాఖ్యానింపబడింది!

## నేపాల్ కొత్తపార్టీ!

తన అన్న అధ్యక్షుడుగావున్న కాంగ్రెసుతో అభిప్రాయభేదాలువచ్చి, పదవినుండి దిగిన మాతృకాప్రసాద్‌కోయిరాలా "నేషనల్ డెమొక్రటిక్ పార్టీ" పేరుతో కొత్త పార్టీని స్థాపించాడు. ఇద్దరూ చీలి, కమ్యూనిస్టులకు అవకాశం కలగచేసి, యిండియా రక్షణకు కూడా ప్రమాదంకలగచేస్తున్నారు యీ అన్నదమ్ములైన నాయకులు!

## కర్నూలు పార్లమెంటు స్థానం

ఖాళీయైన కర్నూలు పార్లమెంటుస్థానానికి పోలవార్పు సీతారామిరెడ్డిగారిని కాంగ్రెస్ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘం సెలక్టుచేసింది. ఇదివరకు యీ స్థానానికి వీరే సభ్యులు కాని ఎన్నికలో జరిగిన పొరపాట్లవల్ల యీ ఎన్నిక రద్దయింది.

వీరితో ప్రజాసోషలిస్టు అభ్యర్థి పోటీచేస్తాడు. కాని రాష్ట్రపార్టీని నియమించిన అభ్యర్థి స్థానికపార్టీకి గిట్టలేదు అంటే ప్రజాపార్టీకి, సోషలిస్టు పార్టీకి హృదయాలు కలవలేదన్న మాట!

## పార్లమెంటులో....!

"మెంబర్లు కాలంలో ప్రశ్నోత్తరాలంటే ఏమిటని ఒకరడిగారు. ఇక్కడునీవు హైలో అంటే ఏమిటి అని ప్రశ్నిస్తున్నావు. నీ తర్వాత ప్రశ్న నియ్యమంటే ఏమిటని వుంటుంది" —డాక్టర్ రాధాకృష్ణన్.

* * *

"సాహిత్యం వృత్తి చేయుటకు సాహితీపరులకు ధనమిచ్చి మొదలుపెడితే, ఆరంగంలోకూడా నల్లబజారు మామూలై పోతుంది" —హెచ్. వి. సేక్సేనా.

* * *

"అఖిలభారత టిక్కెటులేని ప్రయాణీకుల సంఘం తరఫున ప్రభుత్వం వద్దకు ఏదైనా రాయబారం వచ్చిందా?" —టి. యస్. పట్టాభిరామన్.

* * *

"ప్రతివిధవ వివాహం చేసుకొనుటకు అవకాశం కలుగచేసే ఒకబిల్లు వుండాలి" —[illegible]

## రామశర్మగారి మృతి

ఒంగోలు కళాశాల స్థాపకులు, ప్రముఖదాత శ్రీ చిత్తూరుల రామశర్మగారు గత 20 తేది మరణించారు. వీరు ఈ కళాశాలకేగాక అనేక సంస్థలకు వుదారంగా విరాళాలిచ్చిన దాతలు.

## తెలంగాణా ఆయుధాలు

తెలంగాణాలో కమ్యూనిస్టులవద్ద వున్న ఆయుధాలన్నీ అప్పగించబడలేదని, ఇంకా దాదాపు రెండువేలదాకా వారివద్ద వున్నాయని హోం మంత్రి కట్జూ స్టేట్ కౌన్సిల్లో చెప్పారు. కాని అన్ని మావద్ద లేవుబాబో! అంటారు కమ్యూనిస్టులు. ఏమి తెలియని అమాయకుల్లాగా!

## తీర్థులవారి తీర్థం

హైదరాబాద్ నగరం ఆంధ్రనగరమేనని, విశాలాంధ్ర ఏర్పడ్డప్పుడు, దానికి హైదరాబాద్ రాజధాని కాదగునని హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్‌సంఘ అధ్యక్షుడు శ్రీ రామానందతీర్థ ప్రకటించారు.

## ఉస్మానియా సమస్య

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ పీఠంగామార్చే విషయం, ఆంధ్రరాష్ట్రనిర్మాణ సందర్భంలో తాత్కాలికంగా వాయిదా వేయబడిందట. విశాలాంధ్ర నిర్మాణదృష్టితో, అసలు యీఆలోచనే విరమించుకోవచ్చునని వూహిస్తున్నారు.

శ్రీ కస్తూరిదేవి పారిశ్రామిక విద్యాలయము
సహాయార్థం
★
17-5-53 ఆదివారం
విద్యాలయావరణంలో నిర్మించబడివుండు
ప్రత్యేక రంగస్థలంలో
*
చింతామణి
★
రేలంగి
★
కనకం
★
వల్లరామమూర్తి
బృందం
★
అధ్యక్షత వహించుటకు
శ్రీమతి పి. భానుమతి
గారిని ఆహ్వానించివున్నారు
— ప్రవేశరుసుము —
రూ. 10, 5, 3, 2, 1

Printed and Published by N Sree Rama Murthy, at the Zamin Ryot Power Press, 170, Thipparajuvari St., Nellore.